క్లుప్తంగా

నేటి నుంచి షిరిడీ ఆలయ వార్షికోత్సవాలు

పరిగి: పట్టణ కేంద్రంలోని షిరిడీ సాయి బాబా దేవాలయ 20వ వార్షికోత్సవాలను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న సాయిబాబ ఊరేగింపు, పల్లకీసేవ, 11న సాయి కాకడ హారతి, సుప్రభాతం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

12న గోట్లపల్లిలో శివపార్వతుల కల్యాణం



గర్భగుడిలో కొలువుదీరిన దేవాతామూర్తులు

పెద్దేముల్: మండల పరిధి గోట్లపల్లి శివాలయం జాతర ఆదివారం నుంచి ప్రారంభం కానుందని ఆలయ ధర్మకర్త మల్లప్ప స్వామి శుక్రవారం తెలిపారు. ఈ నెల 10న ఉదయం అభిషేకం, పూర్ణవతి పూజ, 11న ఉదయం 10 గంటలకు రుద్రాభిషేకం, నవగ్రహాల పూజ, హోమం, మధ్యాహ్నం 3గంటలకు పార్వతీ పరమేశ్వరుల గంగస్నానం జరగనుందని పేర్కొన్నారు. 12న ఉదయం 6గంటలకు అగ్నిగుండం, అభిషేకం, 9గంటలకు బోనాలు, 11.30 గంటలకు శివపార్వతుల కల్యాణం జరగనుందని వెల్లడించారు. అనంతరం శివ భక్తులు, భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ల రికవరీ



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ శంకర్

యాలాల: పోగొట్టుకున్న రెండు ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు రికవరీ చేశారు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ గ్రామానికి చెందిన మాణెప్ప పది నెలల క్రితం తన స్మార్ట్ ఫోన్‌ను పోగొట్టుకొని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బషీరాబాద్ మండలానికి చెందిన రాజు.. లక్ష్మీనారాయణపూర్ పెట్రోల్ పంపు సమీపంలో మూడు నెలల తన క్రితం ఫోన్‌ను కోల్పోయాడు. అప్పట్లో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ల లోకేషన్లపై దృష్టిపెట్టారు. ఫలితంగా వాటి ఆచూకీ కనుగొని, శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు ఫోన్లను ఎస్ఐ శంకర్ అందజేశారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

దౌల్తాబాద్: స్పెషల్ డ్రైవ్ పనులు మండల పరిధిలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 7నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు 14వరకు జరగనున్నాయి. గ్రామాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించడం, శానిటేషన్ పనులు జీపీ సిబ్బంది చేస్తుండగా.. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు వాటిని పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా పురంధర దాసుల పుణ్యతిథి



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పురంధర దాసుల పుణ్యతిథిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గోపాల సేవ, పురంధర దాసుల కీర్తన, నగరక సంకీర్తన, అనంతరం స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు అక్కి శ్రీనివాసమూర్తి పురంధర దాసుల ప్రవచనాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం తాలూకా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, సంఘం నాయకులు రామారావు, కొడీడు రామారావు, వెంకోబాచారీ, జయతీర్థాచారీ, మురారి వాసిష్ఠ, నాగారం రాఘవేంద్రచారీ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

కుల్కచర్ల: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రజల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి, వేడుకలు జరుపుకొనేందుకు గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

ఉపాధి అక్రమాలపై ఆగ్రహం

- వలు గ్రామాల్లో సిబ్బంది చేతివాటం
- చేయని పనులకు బిల్లులు
- మార్ఫింగ్ ఫొటోలతో మోసం
- ప్రజావేదికలో కూలీల ఆరోపణ
- చర్యలు తీసుకోవాలి: ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్



చిన్ననందిగామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న కూలీ. చిత్రంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ తదితరులు

కొడంగల్: గత ఏడాది జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని కూలీలు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో ఈజీఎస్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కొడంగల్ మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులపై బహిరంగ విచారణ చేపట్టారు. ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు మండల పరిధి 26 పంచాయతీల్లో రూ.7కోట్ల 11లక్షలు వెచ్చించి 1,011 పనులు చేసినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. ఈ పనులపై సామాజిక బృందాల సభ్యులు ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి పనులపై విచారణ చేశారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు వివరించారు.

మట్టి కొట్టకుండానే..

ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన జరిగిన ప్రజావేదికలో ఏపీడీ సరళ, అంబుడ్స్‌మెన్ రాములు, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ భార్గవి పాల్గొని ఉపాధి పనులపై విచారణ చేపట్టారు. ఇందులో పలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శించినట్లు బహిర్గతమైంది. చేయని పనులకు బిల్లులు చెల్లించారని, ఉపాధి పనులు చేశారంటూ చనిపోయిన వారి పేరిట బిల్లులు డ్రా చేశారని, మట్టి కొట్టకుండానే బిల్లులు కొట్టేశారని పేర్కొన్నారు. శాంక్షన్ కంటే ఎక్కువగా బిల్లులు చెల్లించారని, మెజర్‌మెంట్‌లో భారీగా తేడాలు ఉన్నాయని, హరితహారం పథకంలో మొక్కలు నాటకుండానే బిల్లుల చెల్లించారని, సర్వే నంబర్ పట్టాదారు పాసుపుస్తకాలు లేకుండానే పనులు చేసినట్లు రికార్డు చేసి, అవినీతికి పాల్పడ్డారని సామాజిక బృందం సభ్యులు తెలిపారు. కూలీ పనులకు రాని వారి ఫొటోలను మార్ఫింగ్ చేసి, ప్రభుత్వాన్ని మోసం చేశారని వివరించారు. మండల పరిధిలోని చిన్ననందిగామ గ్రామానికి చెందిన కూలీలు ప్రజావేదికగా.. గ్రామంలో జరిగిన అవకతవకల గురించి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ విషయం సామాజిక తనిఖీ బంధ్యం సభ్యుల విచారణలో తేలిందని అధికారులకు చెప్పారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ పారదర్శకంగా, జవాబుదారీగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పాండు, ఏపీఓ రాములు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ఇతర అంశాలపై అవగాహన ఉండాలి: ఎస్ఐ శ్రీశైలం



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ శ్రీశైలం

కుల్కచర్ల: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, ఆకర్షణలకు లోనుకాకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగే.. విద్యపై దృష్టి సారించాలని ఎస్ఐ శ్రీశైలం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో సామాజిక అంశాలు, బాల్యవివాహాలు, సైబర్ క్రైం, మహిళలపై జరుగుతున్న దాడులు, మానవ అక్రమ రవాణా, విద్య ఆవశ్యకత తదితర అంశాలపై పోలీసు కళాజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అంశాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. విద్యార్థులు.. తల్లిదండ్రులకు సైబర్ నేరగాళ్ల గురించి వివరించాలని, ఫోన్లకు వచ్చిన ఓటీపీలను ఎవరికీ చెప్పరాదని తెలపాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేసే వారికి.. తద్వారా కలిగే అనర్థాల గురించి వివరించాలని, వినని పక్షంలో పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, షీటీం ఇన్‌చార్జి నర్సింహులు, మనీష, శోభారాణి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం బాగుంటేనే జీవితం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్ఎం వెంకటరత్నం తదితరులు

బంట్వారం: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యం బాగుంటేనే జీవితం సాఫీగా సాగుతుందని బార్వాద్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీహెచ్ వెంకటరత్నం అన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోట్‌పల్లి మండలం బార్వాద్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయరాదని, నిత్యం పౌష్టికాహారం తీసుకుంటే.. ఆరోగ్యంగా ఉండటంతో పాటు, బాగా చదువుకుంటారని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం ప్రభావతి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాంచంద్రయ్య, విజయ, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి



కుల్కచర్ల: పీఆర్టీయూ జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు



వికారాబాద్: పీఆర్‌టీయూ జెండా ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవంలో సంఘం నేతలు

కుల్కచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎనలేని కృషి చేసిందని ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బస్వరాజులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1971లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ సంఘం.. టీచర్ల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేసిందన్నారు. విద్యావ్యవస్థలో ఎప్పటికప్పుడు నూతన సంస్కరణలు తీసుకువచ్చిందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఉపాధ్యాయులకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎంఈఓ హబీబ్ అహ్మద్, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పరందాములను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండల గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి దేవి, సంఘం నాయకులు పెంటయ్య, నర్సింహులు, తావుర్య, సతీష్, వెంకటయ్య, మహేశ్వర్ రెడ్డి, హన్మయ్య, శివప్రసాద్, వెంకట్రాములు, సుధీర్, దేవుల, శేఖర్, తిరుపతిరెడ్డి, సంతోష్, ప్రవీణ్, పురుశోత్తం, బాల్య తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నేతలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల పక్షాన ముందుండి పోరాటం చేస్తుందన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం వికారాబాద్ ప్రధాన కార్యదర్శి బాబ్యానాయక్, ధారూర్ అధ్యక్షుడు శ్రీనివాస్, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆశలకు కనీస వేతనం చెల్లించాలి

- కుటుంబం గడవని దుస్థితిలో వర్కర్లు
- పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి రామకృష్ణ
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, ఆశ వర్కర్లు

అనంతగిరి: చాలీచాలని వేతనాలతో ఆశలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి కుటుంబం గడవడం కూడా కష్టసాధ్యంగా మారిందని, కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఆశ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రతి నెల రెండో తేదీలోపు పారితోషికాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌సీ డెలివరీల పేర్లతో టార్గెట్ పెట్టి, ఆశలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. అక్టోబర్ 9న అధికారులు ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషకాలను రూ.18వేలకు పెంచి, కనీస వేతనంగా నిర్ణయించాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్.. 16 నెలల బకాయి డబ్బులను చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు ఇవ్వాలని, అభయహస్తం, మహాలక్ష్మి, తదితర పథకాలన్నీ ఆశలకు వర్తించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో పదోన్నతి సౌకర్యం కల్పించి, వెయిటేజీ మార్కులు నిర్ణయించాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని యెడలా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మాధవి, కార్యదర్శి మంగమ్మ, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకురాలు ఉమాదేవి, అరుణ, సుజాత, రాజ్యలక్ష్మి, నర్సమ్మ, పద్మ, మున్నిబాయి, సుజాత, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అటవీ హద్దుల సర్వే



అటవీ ప్రాంతంలో సర్వే చేస్తున్న అధికారులు

పూడూరు: అటవీ సరి హద్దుల గుర్తింపు కోసం రెవిన్యూ, ఫారెస్టు అధికారులు సంయుక్తంగా సర్వే పనులు చేపట్టారు. మండల పరిధి దామగుండం అటవీ ప్రాంతంలో 2,900 ఎకరాలను నేవీ రాడార్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఫారెస్టు, రెవిన్యూ అధికారులు అటవీ భూముల్లో సర్వే పనులు మొదలు పెట్టారు. అనంతరం హద్దులు ఏర్పాటు చేసి, నేవీ అధికారులకు అప్పగించేందుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయం, కోనేరు విస్తీర్ణం, దేవుడి మాన్యం వదిలి పెట్టి సర్వే చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో నేవీ, ఫారెస్టు, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'పట్నం'పై విమర్శలు తగవు

యాలాల: కాంగ్రెస్‌లో చేరనున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబంపై జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్.. విమర్శలు చేయడం మంచిది కాదని మండల యువజన కాంగ్రెస్ యువ నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి హితవు పలికారు. ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే ఊరుకోమని, నీవు కూడా వివిధ పార్టీలు మారిన విషయాన్ని మరచిపోరాదని రాజ్‌గౌడ్‌కు ఆయన గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దృష్టిలో పడేందుకు రాజుగౌడ్.. చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, నోరు అదుపులో పెట్టుకోకుంటే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

కొడంగల్‌లో 2,42,267 మంది ఓటర్లు

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గ పరిధి 8 మండలాల్లో మొత్తం 2,42,267 మంది ఓటర్లు ఉన్నట్లు ఓటరు తుది జాబితాలో ప్రకటించారు. అందులో పురుషులు 1,19,237, మహిళలు 1,23,020, ఇతరులు 10 మంది ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు డీటీ శివకుమార్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో 6వేల మంది కొత్త ఓటర్లు పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

నమ్మక ద్రోహులు పార్టీని వీడటమే మంచిది



అనిల్ బాండ్

తాండూరు టౌన్: తెలంగాణ ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్‌ను నమ్మించి మోసం చేసిన ద్రోహులు.. పార్టీని వీడటం మంచిదేనని ఆ పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు అనిల్ బాండ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్‌లో ఉంటూ, ఎన్నికల్లో సొంత పార్టీకి చెందిన పైలెట్ రోహిత్‌రెడ్డి ఓటమికి కారకులైన పట్నం కుటుంబ సభ్యులు.. ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదవుల కోసం పార్టీకి ద్రోహం చేసిన వారి కపట నాటకాన్ని నియోజకవర్గ ప్రజలు గుర్తించారన్నారు. మా నాయకుడు రోహిత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను ఎండగడతామన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయని ఎడలా, యువజన విభాగం తరుపున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: ప్రజాపాలన కార్యక్రమంలో రూ.500ల గ్యాస్ సిలిండర్ కొరకు అర్హుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధి గ్రామాల్లో కార్యదర్శులు లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తుండగా.. ఎంపీడీఓ పర్యవేక్షించారు. కుటుంబ యజమాని పేరున చేసుకున్న దరఖాస్తులో.. గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరున ఉంది, ఏ కంపెనీ గ్యాస్, సరఫరా దారులు ఎవరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆధార్, ఫోన్ నంబరు వంట గ్యాస్ కనెక్షన్‌తో సరిపోను ఉంటే.. ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారని పేర్కొన్నారు. దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియలో ఏమైనా తప్పులు దొర్లినట్టయితే.. సరిచేస్తున్నట్లు వెల్లడించారు. అర్జీల పరిశీలన అనంతరం ప్రభుత్వ నిర్ణయం ప్రకారం అర్హులకు వంట గ్యాస్ సరఫరా అవుతుందని చెప్పారు.

విశ్వకర్మలు ఐక్యంగా ఉండాలి

పరిగి: విశ్వకర్మలు, విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్ల పాండురంగాచారీ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో సంఘం నూతన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కలిసికట్టుగా ఉండి పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కరించుకునేందుకు మార్గం సులువవుతుందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే మనందరం బలంగా ఉండాలన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా.. తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం మండల అధ్యక్షుడు చెన్నయ్య, జగదీశ్, రవి, రమేష్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండల పరిధి గోవిందాపూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త మహమ్మద్ జహూర్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. శుక్రవారం ఆయన కుటుంబానికి పార్టీ బీమా రూ.2లక్షల చెక్కును అందజేశారు. అనంతరం మాట్లాడారు. ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని చెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ రంజిత్‌రెడ్డిని, తిరిగి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్, నాయకులు అనూప్‌రెడ్డి, కుశాల్‌కుమార్, సాయిలు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన

కొండాస్‌పేట: విద్యార్థులే ఉపాధ్యాయులై.. పాఠశాల విధుల్లో స్వయం పరిపాలనను చవిచూశారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్వామి వివేకానందస్వామి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డీఈఓగా విజయ్, ఎంఈఓగా జయంత్, హెచ్ఎంగా అవంతి, పీఈటీగా ఆనంద్, 32మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటివారికి పాఠాలు బోధించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, నిత్యం క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నర్సింహులు, హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నిరోష, శ్యామల, లక్ష్మి, విజయ, శ్రీదేవి, భాగ్య, రాణి, సిబ్బంది ఉన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ప్లాస్టిక్ రహిత సంచుల వితరణ



సంచుల పంపిణీ

పూడూరు: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబీకులు వెంకట్‌రెడ్డి, సోదరి పవిత్రలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు ఇంటింటికీ ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రధాని మోదీ చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా మారాయన్నారు. ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 'ప్రకృతిని కాపాడుకుందాం.. అభివృద్ధిని సాధించుకుందాం' అంటూ ప్రధాని, మాజీ ఎంపీ చిత్రపటాలతో కూడిన సంచులను తయారు చేసి, ఇంటింటికీ చేరవేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సినిమా సెన్సార్ బోర్డ్ మెంబర్ మల్లేశ్ పటేల్, నాయకులు సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'తో పేదలకు మేలు

షాబాద్: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు గృహజ్యోతికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెల 15వరకు లబ్ధిదారుల వివరాలు సేకరించాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో విద్యుత్ సిబ్బంది ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు.

దాదాపు 10 లక్షల మంది..

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంబాగ్ సెంటర్‌కు కేటగిరి–1 కింద గృహ విద్యుత్ వినియోగదారులు దాదాపు 10 లక్షల మంది ఉన్నారు. ప్రతి నెలా మాదిరిగానే బిల్లింగ్ చేస్తూ వినియోగదారుల వివరాలను సిబ్బంది సేకరిస్తున్నారు. రేషన్ కార్డు ప్రమాణికం కావడంతో బిల్లింగ్ మిషన్లో అదనంగా లబ్ధిదారుడి వివరాలు నమోదు చేసేందుకు ఇటీవల ఆప్షన్ ఇచ్చారు. అందులో ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్, మీటర్ నంబర్ వివరాలు నమోదు చేస్తున్నారు. 15వ తేదీ వరకు అర్హుల వివరాలను బిల్లింగ్ మిషన్‌లో పొందుపర్చాలన్నా ఆదేశాలతో బిల్లింగ్ సిబ్బంది, లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, అర్టిజన్లు ఇంటింటికీ తిరుగుతున్నారు. అద్దెకు ఉంటున్న వారి వివరాలను సైతం సేకరిస్తున్నారు.